




దిన పత్రిక

# తొలి సమయం

వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 51 | బుధవారం 19-02-2025 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..


# సైబర్ నేరాల నియంత్రణకు అధిక ప్రాధాన్యం

## సైబర్ నేరాలను అరికట్టేందుకు 7 కొత్త పోలీసు స్టేషన్లు

**సొమ్ము రికవరీలో సైబరాబాద్ పోలీసుల ముందంజ**

**ప్రత్యేకమైన సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు**

**'షీల్డ్ 2025'లో కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి**




**హైదరాబాద్,ఫిబ్రవరి18:** నేరాల శైలీ మారుతోంది, దానికి అనుగుణంగా ప్రజలు, ప్రభుత్వం మారాల్సి ఉందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు తెలంగాణలో ప్రత్యేకంగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి అన్నారు. సైబర్ నేరాల పరిష్కారం కోసం హెచ్ఐసిసిలో ఏర్పాటు చేసిన 'షీల్డ్ 2025'లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'సైబర్ నేరాల్లో కోల్పోయిన సొమ్ముని తిరిగి తీసుకురావడంలో సైబరాబాద్ పోలీసులు ముందంజలో ఉన్నారని అన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు గత ఏడాది 7 కొత్త పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేశాం. ఒకప్పుడు ఇంట్లో ఉండే సొమ్మును దొంగలు దోచుకొనేవారు.. కానీ ఇప్పుడు ఎక్కడి నుంచి దోపిడి చేస్తున్నారో తెలుసు కోవడం కష్టంగా మారిపోయిందన్నారు. సైబర్ నేరాల్లో సొమ్ము రికవరీల్లో సైబరాబాద్ పోలీసులు ముందంజలో ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో ప్రత్యేకమైన సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు చేశాం. సైబర్ నేరాల్లో సొమ్ము రికవరీల్లో సైబరాబాద్ పోలీసులు ముందంజలో ఉన్నారు. అయితే నేరం ఎక్కడి నుంచి ఎవరు చేశారో కనుక్కోవడం పెద్ద సవాలుగా మారింది. నేరాల శైలి మారుతోంది. వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రజలు, ప్రభుత్వం మారాలని అన్నారు. దేశంలోనే సైబర్ సేఫ్టీలో మన రాష్ట్రాన్ని నంబర్ వన్ గా నిలపడమే మా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. మొదటిసారి ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్‌ను సిఎం రేవంత్ అభినందించారు. తెలంగాణను నంబర్ వన్ సైబర్-సేఫ్ స్టేట్‌గా మార్చడానికి కలిసి పనిచేస్తున్న మీ అందరినీ ఇక్కడ కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. దేశంలో సైబర్ నేరగాళ్లు గత ఏడాది రూ. 22,812 కోట్లు దోచుకున్నారని ఒక అంచనా. ఇది మన ఆర్థిక వ్యవస్థకు, మన పౌరులకు ముప్పు. ఈరోజుల్లో ఫేక్ న్యూస్ అనేది మరో ప్రధానమైన ముప్పు. సోషల్ మీడియాలో తప్పుడు సమాచారంతో సమాజంలో గందరగోళం ఏర్పడుతుంది. సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్ కోసం ఎకో సిస్టమ్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు... మా ప్రభుత్వం నిపుణులు, ఎఐ సంస్థలతో కలిసి పనిచేయడానికి, అన్ని రకాల వనరులు సమకూరుస్తోంది. మనం తెలంగాణను సెక్యూర్ బిజినెస్ హబ్ గా మార్చాల్సి ఉందన్నారు. 1930 నంబర్ ను అందరికీ షేర్ చేయాలని ప్రతీ ఒక్కరినీ కోరుతున్నా.. ఇది 24/7 సైబర్ హెల్ప్‌లైన్ అని అన్నారు. పూర్తిస్థాయిలో పనిచేసే సైబర్ సెక్యూరిటీ బ్యూరో, పౌరులను రక్షించడానికి అంకితమైన సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ ఉన్న అతికొద్ది రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని సిఎం అన్నారు. ఈక్రమంలో సమాజంలో వస్తున్న సవాళ్లను ఎదుర్కోవడానికి అన్ని రకాల ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సైబర్ క్రైం ను నియంత్రించడంలో దేశంలోనే తెలంగాణ ముందు వరుసలో ఉంది. కానీ సైబర్ క్రైమ్ విభాగాన్ని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నేరం జరిగిన తరువాత పట్టుకోవడం కాదు.. నేరం జరగకుండా నిరోధించేలా చూడాల్సి ఉందన్నారు. కొంతమంది సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ ను ప్రచారం చేస్తున్నారు. ఫేక్ న్యూస్ తో పాటు ఆర్థిక నేరాలను కూడా నిరోధించాల్సిన అవసరం ఉంది. సైబర్ క్రైమ్ నియంత్రణలో తెలంగాణను దేశానికే రోల్ మోడల్ గా తీర్చిదిద్దుదామని అన్నారు.

# ఢిల్లీని వెనక్కి నెట్టిన హైదరాబాద్

**పెరుగుతున్న అంతర్జాతీయ పెట్టుబడులు**

**గ్రామీణ ప్రాంత ప్రజలూ నగరబాట..**



**హైదరాబాద్,ఫిబ్రవరి18:**

హైదరాబాద్ నగరం విశ్వనగరంగా అభివృద్ధి చెందుతోంది. అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు నగరంలో పెట్టుబడులు పెడుతున్నాయి. దీంతో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు హైదరాబాద్‌లో సెటిల్ అవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు కూడా నగరబాట పడుతున్నారు. నగరంలో మెరుగైన ఉపాధి అవకాశాలు ఉండటంతో సిటీలో సెటిల్ అయ్యేవారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. దీంతో హైదరాబాద్ నగర జన సాంద్రత పెరిగుతోంది. జన సాంద్రత విషయంలో తాజాగా దేశ రాజధాని ఢిల్లీని హైదరాబాద్ వెనక్కి నెట్టింది. తెలంగాణ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్-2024 నివేదిక గణంకాలు వెల్లడించింది. నగరంలో చదరపు కిలోమీటరుకు 18,161 మంది జనాభా సాంద్రత ఉన్నట్లు వెల్లడించింది. ఈ సంఖ్య రాజధాని ఢిల్లీలో చదరపు కిలోమీటరుకు 11,313 మాత్రమే ఉన్నట్లు పేర్కొంది. జన సాంద్రత విషయంలో ఇండియాలో ముంబై తొలి స్థానంలో ఉంది. అక్కడ చదరపు కిలోమీటరుకు 28,508 ఉన్నట్లు గణాంకాల ద్వారా వెల్లడైంది. ప్రపంచంలో అత్యంత జనసాంద్రత కలిగిన నగరంగా ఫిలిప్పీన్స్‌లోని మనీలా నిలిచింది. అక్కడ ఒక చదరపు కిలోమీటరులో 43,079 మంది నివసిస్తున్నారు. అయితే వేగవంతమైన పట్టణీకరణ ఓ సవాల్ లాంటిదేనని నిపుణులు అంటున్నారు. అది రెండు వైపులా పదును ఉన్న కత్తి లాంటిందని చెబుతున్నారు. జనాభా పెరుగుదలతో ఓ వైపు హైదరాబాద్ నగరం వృద్ధి పథంలోకి వెళ్తున్నా.. అదే సమయంలో అందుకు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించటం ప్రభుత్వానికి శక్తికి మించిన పని అంటున్నారు. పెరుగుతున్న జనాభా మౌలిక సదుపాయాలు, ప్రజా సేవలు, ఇండ్ల నిర్మాణంపై ఒత్తిడిని పెంచుతాయని చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. ఓ వైపు హైదరాబాద్ నగరంలో జన సాంద్రత పెరుగుతుండగా.. తెలంగాణలో మాత్రం పరిస్థితి వేరుగా ఉంది. 2011 జనాభా లెక్కల డేటా ప్రకారం.. రాష్ట్ర జనాభా 3.5 కోట్లుగా ఉంది. తెలంగాణ మొత్తం 1,12,077 చదరపు కిలోమీటర్ల భౌగోళిక విస్తీర్ణాన్ని కలిగి ఉంది. చదరపు కిలోమీటరుకు 312 మంది జనాభా సాంద్రతను కలిగి ఉంది. 2031 నాటికి ఇది మరింత తగ్గే ఛాన్స్ ఉందని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంలో యువ జనాభా కూడా తగ్గుతున్నట్లు అంచనా వేస్తున్నారు. 2031 నాటికి 39 ఏళ్ల వయస్సు లోపు ఉన్నవారి జనాభా 0.23 శాతం తగ్గే ఛాన్స్ ఉందని అంటున్నారు. అదే సమయంలో 40 ఏళ్లు పైబడిన వారి సంఖ్య పెరుగుతుందని.. దీని కారణంగా రాష్ట్రంలో వృద్ధ జనాభా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# తెలంగాణ ప్రభుత్వం రైతులకు శుభవార్త

**పంటల రక్షణకు మరో పథకం**

**పంటల రక్షణకు సోలార్ పెన్సింగ్ స్కీం పెట్టో యోచన**

**డ్రిప్, తుంపర సేద్య పరికరాల అందించేందుకు సిద్ధం**

**మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి**



**హైదరాబాద్,ఫిబ్రవరి18:** తెలంగాణ రైతులకు రేవంత్ రెడ్డి సర్కార్ మరో శుభవార్త చెప్పనుంది. పంటల రక్షణ కోసం కొత్త స్కీం తీసుకురానుంది. దీంతో పాటు.. రైతుల అవసరాలకు సంబంధించిన పరికరాలను అందించే యోచనలో సర్కార్ ఉన్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. అడవి జంతువులు, కోతుల నుండి పంటల రక్షణకు సోలార్ పెన్సింగ్ స్కీంను ప్రవేశపెట్టే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు మంత్రి తుమ్మల పేర్కొన్నారు. అంతేకాకుండా.. పామాయిల్‌తో పాటు ఇతర పంటలకు డ్రిప్, తుంపర సేద్య పరికరాలను అవసరం మేరకు రైతులకు అందించాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో పాటు.. రాష్ట్ర అవసరాలు తీర్చే విధంగా కూరగాయల సాగు పెంపునకు పెరి అర్బన్ క్లస్టర్లను ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు.

# కెసిఆర్ హయాంలో రైతు దర్జాగా బతికాడు

**ఇప్పడేమో బిచ్చమేసినట్లుగా రైతుభరోసా**

**రుణమాఫీ పేరుతో రైతులకు టోకరా**

**15వేలు అని చెప్పి అన్నదాతలను మోసం చేశారు**

**ఏడాది దాటినా ఎవ్వరికీ ప్రయోజనం లేదు**

**ఆమనగల్ రైతు ధర్నాలో కెటిఆర్ విమర్శలు**



**రంగారెడ్డి,ఫిబ్రవరి18:** పదేండ్ల పాటు కేసీఆర్ హయాంలో రైతు ఒక రాజులాగా బ్రహ్మాండంగా బతికాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పదిహేను నెలల కాలంలో రేవంత్ రెడ్డి సర్కార్ ఎవరికీ న్యాయం చేయలేదు. రైతు రుణమాఫీ, రైతుబంధు, తులం బంగారం, మహిళలకు రూ. 2500 రాలేదు. 420 హామీలిచ్చి దొంగమాటలు చెప్పి అధికారంలోకి వచ్చాడని విమర్శలు గుప్పించారు. రంగారెడ్డి జిల్లా ఆమన్‌గల్‌లో ఏర్పాటు చేసిన రైతు దీక్షలో కేటీఆర్ ప్రసంగించారు. సొంత నియోజకరవ్గరం, సొంత తాలుకాలో కూడా ఒక్కపని చేయలేదు. సొంతూరికి, అత్తగారి ఊరికి ఏం చేసిండో అడుగదామని వచ్చానని కేటీఆర్ తెలిపారు. రూ. 2 లక్షల రుణమాఫీ చాలా మందికి కాలేదు. రైతుబంధు కూడా రాలేదు. టకీటకీమని పైసలు పడలేదు. గత 6 నెలల నుంచి అన్ని జిల్లాల్లో తిరుగుతున్నాం. గత పదేండ్లలో మోటార్లు కాలలేదు.. ట్రాన్స్‌ఫార్మర్లు పేలలేదు. అప్పుడు అప్పు అడిగే పరిస్థితి లేదు. నాట్లు వేసే నాటికి రైతుబంధు పడుతుండే. రేవంత్ రెడ్డి కొత్త పదం పట్టుకుని టకీ టకీమని పడుతాయ్ అన్నాడు. టకీ లేదు టుక్ లేదు అని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. రైతుబంధు కేసీఆర్ బిచ్చమేసినట్లు రూ. 10 వేలు ఇస్తుండు.. నేను రూ. 15 వేలు వేస్తా అన్నాడు. కనీసం 10 శాతం మందికి కూడా రైతుబంధు ఇవ్వలేదు. ఒకేసారి రుణమాఫీ చేస్తా అని అన్నాడు. చారణా కూడా రుణమాఫీ చేయలేదు. 10 శాతం మందికి కూడా బోనస్ పడలేదు అని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ పాలనతో ఏ వర్గమూ సంతోషంగా లేదని కేటీఆర్‌అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని ఆ పార్టీ నేతలు మళ్లీ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో ప్రజలు మళ్లీ మోసపోతే ఎవరూ కాపాడలేరన్నారు. 'కేసీఆర్ హయాంలో రైతు రాజులా బతికాడు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక సోనియాగాంధీ పుట్టినరోజు రెండుసార్లు వచ్చింది.. కానీ రుణమాఫీ 25 శాతం కూడా కాలేదు. 35 సార్లు దిల్లీ విమానం ఎక్కారు..

# కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరగరాదు

**ఎపి ప్రభుత్వం అక్రమంగా నీటిని తరలిస్తోంది**

**నీటిపారుదలశాఖ మంత్రుల భేటీలోమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి**




**హైదరాబాద్,ఫ్రబవరి18:** కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరగ కుండా కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కోరారు. ఏపీ ప్రభుత్వం కృష్ణాజలాలను అక్రమంగా తరలిస్తోందని, కేంద్రం అడ్డుకోవాలన్నారు. జయపురలో కేంద్ర జలశక్తిశాఖ ఆధ్వర్యంలో జరిగిన నీటిపారుదల శాఖ మంత్రుల సమావేశంలో పాల్గొన్న ఉత్తమ్.. నీటి నిల్వ సదుపాయాలు, నీటి సరఫరా నిర్వహణపై ప్రజెంటేషన్ ఇచ్చారు. కృష్ణా జలాల వినియోగాన్ని లెక్కించేందుకు టెలిమెట్రీ ఏర్పాటు చేయాలని కోరారు. 55 కిలోమీటర్ల పొడవునా చేపడుతున్న మూసీ పునరుజ్జీవ, అభివృద్ధి ప్రాజెక్టుకు కేంద్రం నిధులివ్వాలని.. గంగా, యమునా పునరుద్ధరణ తరహాలో మూసీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని మంత్రి అన్నారు. మూసీ వెంట ట్రంక్, సీవరేజ్ నెట్ వర్క్ కోసం రూ.4వేల కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌కు గోదావరి జలాలను తరలించే పనులకు రూ.6వేల కోట్లు ఇవ్వాలని కోరారు. కృష్ణా ట్రైబ్యునల్ తీర్పు త్వరగా వచ్చేలా కేంద్రం చొరవ తీసుకొని తెలంగాణకు న్యాయం చేయాలన్న ఉత్తమ్.. పాలమూరు-రంగారెడ్డి, సమ్మక్క-సారక్క, సీతారామసాగర్ ప్రాజెక్టుల కు నీటి కేటాయింపుల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

# విద్యారంగంలో సమూల మార్పులకు యోచన

**స్కిల్స్ పెంచేలా పాఠ్యాంశాల్లో మార్పులు**

**సింఘానియా స్కూల్స్‌తో ఒప్పందంలో మంత్రి లోకేశ్**

**అమరావతి,ఫిబ్రవరి18:** విద్యార్థుల్లో స్కిల్స్ పెంచేలా విద్యావిధానంలో మార్పులకు కృషి చేస్తున్నామని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. అందుకు అనుగుణంగా మార్పులు చేస్తున్నామని అన్నారు. ఏపీలో విద్యారంగాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఇప్పటి వరకు అమలు చేస్తోన్న మూస పద్ధతులకు స్వస్తి చెప్పి సృజనాత్మకత పెంపొందించేలా కేజీ టు పీజీ విద్య కరిక్యులమ్‌లో సమూల మార్పులు తెస్తున్నామన్నారు. కళాశాల నుంచి బయటకు వచ్చే విద్యార్థికి వెనువెంటనే ఉద్యోగం లభించేలా నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. జాతీయ విద్యావిధానం లక్ష్యసాధనలో భాగంగా రాష్ట్రంలో విద్యానైపుణ్యాలు అభివృద్ధి చేసేందుకు సులోచనాదేవి సింఘానియా స్కూల్ ట్రస్ట్‌తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఉండవల్లిలోని ఆయన నివాసంలో ఏపీ ప్రభుత్వంతో సింఘానియా గ్రూప్, ఏపీ ప్రభుత్వ ప్రతినిధుల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. తిరుపతి జిల్లాలోని 14 పాఠశాలల్లో ఉపాధ్యాయుల పనితీరు, నాణ్యత, ఉపాధ్యాయ శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీషు శిక్షణతో పాటు జాతీయ విద్యావిధానంతో సమాంతరంగా సాంకేతికత అనుసంధానం వంటి అంశాల్లో విద్యా నైపుణ్యాన్ని తీసుకురావడం ద్వారా పాఠశాలల నిర్వహణలో మార్పులు తేవాలని నిర్ణయించారు. ఐదేళ్ల వ్యవధిలో అమలుచేసే ఈ కార్యక్రమం ద్వారా లక్ష మంది విద్యార్థులకు మెరుగైన విద్య అందనుంది. ఆ తర్వాత అమరావతి, విశాఖపట్నం, కాకినాడకు కూడా ట్రస్ట్ సేవలను విస్తరించ నున్నారు. విద్యార్థులను ఉన్నత సాంకేతిక పరిజ్ఞానంతో నైపుణ్యవంతంగా తయారు చేయడమే లక్ష్యమని సింఘానియా గ్రూప్ చైర్మన్ తెలిపారు.

# భద్రకాళి చెరువు పూడికతీత పనులను వేగవంతం చేయాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య**



**తొలి సమయం హన్మకొండ ఫిబ్రవరి 18:**
భద్రకాళి చెరువు పూడికతీత పనులను వేగవంతం చేయాలని సంబంధిత శాఖల అధికారులను హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య ఆదేశించారు. మంగళవారం భద్రకాళి చెరువు పూడికతీత పనులను సంబంధిత శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. భద్రకాళి చెరువు పూడికతీత పనులు, మట్టి తరలింపు, తదితర విషయాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ చెరువు పూడికతీత పనులలో భాగంగా తీసిన మట్టిని ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా తరలింపు జరగాలన్నారు. మట్టి తరలింపునకు వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అంతర్గత రోడ్డు( అప్రోచ్ రోడ్డు)ను నిర్మించాలని సూచించారు. మట్టి తరలింపు సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. పనులు జరుగుతున్న చోట్ల రాత్రి వేళలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. మట్టి తరలించే వాహనాల నమోదు కోసం జంక్షన్, చెక్ పోస్ట్ ను ఏర్పాటుచేసి రెవెన్యూ, పోలీస్, సాగునీటి పారుదల, మున్సిపల్ శాఖల సిబ్బందితో 24 గంటల పాటు పర్యవేక్షణ, తనిఖీ ఉండేటట్టు చూసుకోవాలన్నారు. పూడికతీత మట్టి కావాలనుకునేవారు క్యూబిక్ మీటర్ కు రూ. 72 చెల్లించి తీసుకోవచ్చునని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, మున్సిపల్, కుడా, సాగునీటిపారుదల శాఖల అధికారులు పాల్గొన్నారు.


# విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయాలి

**జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రవీందర్ రెడ్డి**

**ఎఫ్ పి ఎస్ టి మహబూబాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఆన్లైన్ లో సైన్స్ టాలెంట్ టెస్ట్**

**ద్వితీయ స్థాయి కైవసం చేసుకున్న మహబూబాబాద్ జిల్లా విద్యార్థి ఎన్ విష్ణు వర్ధన్**

టాలెంట్ టెస్టులు విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి దోహదపడతాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రవీందర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎఫ్ పి ఎస్ టి మహబూబాబాద్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు దిడ్డి అనిల్ కుమార్ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి ఆన్లైన్ లో సైన్స్ టాలెంట్ టెస్ట్ను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలకు రాష్ట్ర స్థాయిలోని వివిధ జిల్లాల నుండి విద్యార్థులు హాజరయ్యా ప్రథమ,ద్వితీయ,తృతీయ రాష్ట్ర స్థాయిలో ప్రతిభను చాటారు. మహబూబాబాద్ జిల్లా నుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాధపురం పదవ తరగతి విద్యార్థి ఎన్ విష్ణు వర్ధన్ కు రాష్ట్ర ద్వితీయ స్థాయి లభించింది మహబూబాబాద్ జిల్లా విద్య శాఖ అధికారి రవీందర్ విష్ణు వర్ధన్ ను అభినందించి సన్మానించి ఈ సందర్బంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ... ఇలాంటి టెస్ట్లు భవిష్యత్తులో రాబో యే అన్ని రకాల పోటీ పరీక్షలకు ఒక అనుభవంగా ఉపయోగపడుతుందని రాబోయే పదవ తరగతి పరీక్షల్లో సైన్స్ పరీక్షలో మంచి మార్కులు సాధిస్తారని, దానికి ఈ పరీక్షలు దోహదపడుతా యని సైన్స్ పై అభిరుచిని ఏర్పరచుకొని భావిభారత సైంటిస్టులుగా



ఎగదాలని జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులందరిలోని ప్రతిభను వెలికి తీసి వారిని ఉన్నత శిఖరాలు అధిరోహించే విధంగా కృషి చేయాలని అన్నారు.ఎఫ్ ఆర్ ఎస్ టి వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు బద్రీనారాయణ్,ఏ ఎం ఓ ఆజాద్,ఉపాధ్యాయురాలు సునీత తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి హాస్టల్ లో అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు

**హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య**

**భీమదేవరపల్లి మండలం వంగరలోని తెలంగాణ రాష్ట్ర గురుకుల బాలికల పాఠశాలలో హాస్టల్ నిద్ర చేసిన కలెక్టర్**





**తొలి సమయం హన్మకొండ కలెక్టరేట్ ఫిబ్రవరి 18:**
హనుమకొండ: ప్రతి హాస్టల్ లో నిబంధనలో మేరకు అన్ని సౌకర్యాలు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలోని డాక్టర్ పివి రంగారావు తెలంగాణ రాష్ట్ర బాలికల గురుకుల పాఠశాల కళాశాలను హాస్టల్ నిద్ర కార్యక్రమంలో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల కళాశాలలోని విద్యార్థినుల తరగతి గదులు, డార్మెట్రీ, వంట గదులను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థినులకు వండిన భోజనాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాల, కళాశాలలో ఎంత మంది విద్యార్థినులు ఉన్నారని ప్రిన్సిపల్ ఆఫ్రిన్ ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులను విజ్ఞాన యాత్రలకు తీసుకెళ్తున్నారా అని అడిగారు. పీఎం శ్రీ, అమ్మ ఆదర్శ పాఠశాలల కింద మంజూరైన పాఠశాలలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పీఎం శ్రీ పథకం కింద విద్యార్థినులకు, పాఠశాలలో సమకూరిన సదుపాయాల వివరాలను, ఏవైనా సమస్యలు ఉన్నాయా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లోని గ్రంథాలయాన్ని పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల కళాశాలలో 550 మంది విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. గురుకుల పాఠశాల కళాశాలలోని వసతులను పరిశీలించినట్లు చెప్పారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల కళాశాలలో రూ. 24 లక్షలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను పరిశీలించినట్లు తెలిపారు. పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను పది రోజులలో పూర్తి చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. హాస్టల్ లో మెష్ డోర్ల ఏర్పాటుకు ఆర్డర్ ఇవ్వగా త్వరలోనే వాటిని అమర్చనున్నట్లు చెప్పారు. కాంపౌండ్ వాల్, టాయిలెట్స్ మరమ్మతు పనులు పూర్తికానున్నాయని అన్నారు. కొత్తగా అమలులోకి వచ్చిన డైట్ ప్రకారం హాస్టల్ విద్యార్థినులకు అందించే భోజన పట్టికను పాఠశాలలో డిస్ప్లే చేయడం జరిగిందన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారా లేదా అని పరిశీలించినట్లు తెలిపారు. రానున్న పదో తరగతి విద్యార్థినిలకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారా అని వివరాలను అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. ఉదయం హాస్టల్లోని పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి అవసరాలను అడిగి తెలుసుకోనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 109 గురుకుల పాఠశాలలు ఉన్నాయని, వాటి పర్యవేక్షణకు జిల్లాస్థాయి అధికారులను నియమించినట్లు తెలిపారు. రెండు మూడు గురుకుల పాఠశాలలకు ఒక జిల్లా స్థాయి అధికారిని పర్యవేక్షణకు నియమించినట్లు చెప్పారు. రెగ్యులర్ గా జిల్లా స్థాయి అధికారులు హాస్టల్స్ ను సందర్శించి భోజనం చేయడంతో పాటు అక్కడి పరిస్థితులను తమ దృష్టికి తీసుకువస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెల చివరి వారం జిల్లాస్థాయి కమిటీ సమావేశమవుతున్నట్లు చెప్పారు. అధికారులు హాస్టల్స్ ను సందర్శించి అక్కడి సమస్యలను తమ దృష్టికి తీసుకు వస్తుండగా వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ పాఠశాల పీఎం శ్రీ పథకం కింద ఎంపికైందని, ఈ పథకం కింద మంజూరైన నిధులతో అదనపు అభివృద్ధి పనులను చేపట్టాలని ఆదేశించినట్లు చెప్పారు. పీఎం శ్రీ పథకం కింద విద్యార్థుల సంఖ్యను బట్టి నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. పీఎం శ్రీ పథకం జిల్లాలో ఎంపికైన 19 పాఠశాలలకు రూ. 2 కోట్ల 20 లక్షలు మంజూరయ్యాయని, ఇందులో రూ. 1 కోటి 50 లక్షలు పాఠశాలల్లో వివిధ వసతులు కల్పనకు నిధులు ఖర్చు చేసినట్లు తెలిపారు. మిగతా అభివృద్ధి వసతుల కల్పనకు మిగతా నిధులను వెచ్చించనున్నట్లు తెలిపారు. ప్రతి నెల ఐదు వరకు హాస్టల్స్ ను సందర్శిస్తున్నట్లు తెలిపారు. రెగ్యులర్ గా జడ్పీ ఇతర పాఠశాలలో కాకుండా ఐదు వరకు హాస్టల్స్ను సందర్శించి అక్కడి వసతులను తనిఖీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎక్కడైతే ఇన్ఫ్రాస్ట్రక్చర్ సమస్యలు ఉన్నాయో ఉన్న నిధులతో సమకూర్చుతున్నట్లు చెప్పారు. రెగ్యులర్ మెయింటెనెన్స్ తప్పనిసరిగా హాస్టల్స్ లో ఉండాలని నిర్దేశిస్తున్నట్లు తెలిపారు. మెనూ ప్రకారం భోజనం అందించే విధంగా, అదేవిధంగా శానిటేషన్, టాయిలెట్స్ నిర్వహణ బాగుండేలా చూసుకోవాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.అనంతరం హాస్టల్ ప్రిన్సిపల్, అధికారులతో సమావేశమై పాఠశాల కళాశాల గురించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ కు చెందిన విద్యార్థినులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. అనంతరం హాస్టల్లో విద్యార్థినులు, డీఈఓ, మహిళా ఉపాధ్యాయిను లతో రాత్రి బస చేశారు.ఈ సందర్భంగా డీఈవో వాసంతి, అడిషనల్ డిఆర్డివో శ్రీనివాసరావు, ఎంపీడీవో వీరేశం, ఎంఈవో సునీత రాణి, పంచాయతీరాజ్ ఏఈ వినయ్ రెడ్డి, పాఠశాల కళాశాల ఉపాధ్యాయులు అధ్యాపకులు విద్యార్థినులు పాల్గొన్నారు.

## 18 నుండి 21 వరకు విద్యార్థులు సాహస కార్యకలాపాల (అడ్వెంచర్ ఆక్టివిటీస్)లో పాల్గొనాలి

**జిల్లా సంక్షేమ అధికారి జె. జయంతి పిలుపు**




**తొలి సమయం హనుమకొండ ఫిబ్రవరి 18:**
హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లాలోని తొమ్మిది కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలకు చెందిన దాదాపు 400 మంది విద్యార్థినులకు ఈనెల 18 నుండి 21వ తేదీ వరకు ఫోర్టు వరంగల్ లోని ఏకశిలా పార్కులో సాహస కార్యకలాపాలు మంగళవారం ప్రారంభమయ్యాయి అధికారి జే జయంతి పిలుపునిచ్చారు ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి జయంతి మాట్లాడుతూ అడ్వెంచర్ యాక్టివిటీస్ కింద ఐదు(కయాకింగ్, వర్టికల్ ల్యాడర్ క్లయిమ్బింగ్, సింపుల్ సొల్యూషన్ టూ కాంప్లెక్స్ (ప్రాబ్లెమ్స్, రాప్లింగ్) సాహస కార్యక్రమాలకు సంబంధించి శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. కేజీబీవీల్లోని 9వ తరగతి చదువుతున్న విద్యార్థినులను ఎంపిక చేసి సాహస కార్యకలాపాలలో శిక్షణను ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సాహస కార్యకలాపాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థినులలో మనోధైర్యంపెంపొందుతుందని అన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను స్వయంగా పరిష్కరించుకునేందుకు ఇలాంటివి దోహదపడతాయని అన్నారు. తొలి రోజు నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేజీబీవీ ధర్మసాగర్, వేలేరు, ఐనవోలు కు చెందిన 79 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. అడ్వెంచర్ యాక్టివిటీస్ ట్రైనర్ అన్విత సాహస కృత్యాలను విద్యార్థినులకు శిక్షణనిచ్చారు. ఈ సాహస కార్యకలాపాలలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జీసీడీవో సునీత, కేజీబీవీ ప్రత్యేక అధికారులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## గిరిజన సైనిక్ స్కూల్లో విద్యార్థుల మధ్య ఘర్షణ

**హాస్టల్ నుంచి మిస్సయిన వజ్జ సాయి వర్ధన్**

**పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు**



**తొలి సమయం నర్సంపేట ఫిబ్రవరి 18:**
వరంగల్ జిల్లా ఖానాపురం మండలం అశోక్ నగరంలోని గిరిజన సైనిక్ స్కూల్ లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న వజ్జ సాయి వర్ధన్ హాస్టల్లో రెండు రోజుల పాటు లేకపోవడంతో తోటి విద్యార్థులు స్థానిక ప్రిన్సిపల్ కు తెలపడంతో హాస్టల్లో ఏం జరిగింది పూర్తిగా సమాచారమైతే తెలియాల్సి ఉంది. సైనిక్ స్కూల్లో విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగిందని సమాచారం.. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న వజ్జ సాయి వర్ధన్ అనే విద్యార్థి హాస్టల్లో కనబడకుండా పోవడంతో అట్టి విషయాన్ని సాయి వర్ధన్ తల్లిదండ్రులకు ప్రిన్సిపల్ సుధాకర్ సమచారం ఇచ్చారు .అతని తల్లి దండ్రులు హాస్టల్ కి మంగళవారం చేరుకొని జరిగిన సమస్యలను తెలుసుకుని తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ చేశారని ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు...మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులుతెలిపారు.

## ఢిల్లీ సిఎం ఎంపికపై నేడు బిజెపి భేటీ

**పర్వేశ్ వర్మవైపూ బిజెపి నేతల మొగ్గు**

**రేపటి ప్రమాణ స్వీకారానికి భారీగా ఏర్పాట్లు**


**న్యూఢిల్లీ,ఫిబ్రవరి18:** ఈ నెల 20 ఢిల్లీలో బిజెపి ప్రభుత్వం కొలువుదీరనుందని సమాచారం. సిఎం అభ్యర్తి ఎంపిక సోమవారమే జరగాల్సి ఉన్నా..దానిని 19కి వాయిదా వేశారు. బుధవారం జరిగే భేటీలో సిఎం ఎంపిక జరగవచ్చు. 27 ఏళ్ల కలను సాకారం చేసుకుంటూ దేశ రాజధాని దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది భారతీయ జనతా పార్టీ త్వరలోనే ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయనుంది. ఇన్నేళ్ల తర్వాత అధికారంలోకి వస్తుండటంతో నూతన ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారానికి ఘనంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున సినీ తారలు, పారిశ్రామికవేత్తలను ఆహ్వానించినట్లు తెలుస్తోంది.ఫిబ్రవరి 20న గురువారం సాయంత్రం 4.30 గంటలకు కొత్త సీఎం ప్రమాణస్వీకారానికి ముహూర్తం ఖరారైనట్లు భాజపా వర్గాలు వెల్లడించాయి. ప్రఖ్యాత రామ్‌లీలా మైదాన్‌లో జరిగే ఈ వేడుకకు కమలదళం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ప్రమాణస్వీకారానికి ముందు ప్రముఖ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనుంది. ఇక, 50 మంది సినీతారలు, ప్రముఖ పారిశ్రామికవేత్తలతో పాటు ఇతర దేశాల దౌత్యవేత్తలు, 20 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, డిప్యూటీ సీఎంలు, కేంద్రమంత్రులు, భాజపా అగ్రనేతలు ఈ కార్యక్రమానికి హాజరవుఉతన్నట్లు సమాచారం. వీరితోపాటు దిల్లీకి చెందిన పలువురు రైతులు, కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్దిదారులను కూడా ఆహ్వానించినట్లు సమాచారం. బాబా రాందేవ్, స్వామి చిదానంద, బాబా బాగేశ్వర్ ధీరేంద్రశాస్త్రి వంటి ఆధ్యాత్మిక గురువులు ప్రత్యేక అతిథులుగా హాజరుకానున్నట్లు భాజపా వర్గాలు పేర్కొన్నాయి. ఈనెల 8న వెలువడిన శాసనసభ ఎన్నికల ఫలితాల్లో భాజపా భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. అయితే, ఎన్నికల ఫలితాలు వెలువడి 10 రోజులు అవుతున్నా నూతన ముఖ్యమంత్రి ఎవరనేది ఇంకా తేల్చలేదు. మాజీ సీఎం సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు పర్వేశ్‌వర్మ పేరు సీఎం రేసులో ప్రముఖంగా వినిపిస్తోంది. ఈయన తాజా ఎన్నికల్లో ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్‌పై విజయం సాధించారు. బుధవారం భాజపా శాసనసభాపక్ష భేటీ జరగనుంది. అందులో కొత్త సీఎంతో పాటు కేబినెట్ మంత్రులను ఎన్నుకోనున్నారు. దీంతో లాంఛనం పూర్తి కానుంది.

# ప్రభుత్వ లక్ష్యాలను అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలి

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి**

**విద్యుత్ వినియోగదారులకు నిరంతరాయంగా సరఫరా కొనసాగించాలి**

**ప్రభుత్వ కార్యక్రమాల అమలు పై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో సమీక్షించిన సిఎస్**





**తొలి సమయం హనుమకొండ ప్రత్యేక ప్రతినిధి ఫిబ్రవరి 18:**
ప్రభుత్వ లక్ష్యాలను అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు.మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ప్రభుత్వ కార్యక్రమాల పై రాష్ట్రంలోని జిల్లాల కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య, వివిధ శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు. త్రాగు నీటి సరఫరా, రబీ పంటలకు సాగు నీరు , డిమాండ్ కు అనుగుణంగా విద్యుత్ సరఫరా, రేషన్ కార్డుల దరఖాస్తుల ధ్రువీకరణ, రైతు భరోసా పథకాల అమలు పై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సుదీర్ఘంగా చర్చించి కలెక్టర్లకు పలు సూచనలు జారీ చేశారు. విద్యుత్ పై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ గత సంవత్సరం మార్చి నెలలో వచ్చిన అత్యధిక విద్యుత్ డిమాండ్ 15 వేల 623 మెగా వాట్లు ప్రస్తుతం ఫిబ్రవరి మాసంలోనే వస్తుందని అన్నారు.

17 వేల మెగా వాట్ల పీక్ డిమాండ్ వచ్చిన సరఫరా చేసే విధంగా ఏర్పాట్లు జరిగాయని సీఎస్ తెలిపారు. వ్యవసాయం, గృహాలు, పరిశ్రమలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా కొనసాగాలని, అవసరమైన మేర విద్యుత్తు అందుబాటులో ఉన్నందున ఎక్కడ ఎటువంటి లోటు రావడానికి వీలు లేదని సిఎస్ పేర్కొన్నారు. సబ్ స్టేషన్ వారిగా అదనపు విద్యుత్ పంపిణీ తట్టుకునేలా నూతన విద్యుత్ లైన్లు, ట్రాన్స్ ఫార్మర్ ల ఏర్పాటు పనులను ఫిబ్రవరి నెల వరకు పూర్తవుతున్నాయని సీఎస్ పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా అంశంలో స్థానికంగా ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని, డిమాండ్ మేరకు విద్యుత్ సరఫరా లో ఇబ్బందులు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకుని రావాలని సి.ఎస్ కలెక్టర్లకు సూచించారు. ఫీడర్ల వద్ద సమస్యతో గత సంవత్సరం కొన్ని ఇబ్బందులు ఎదుర య్యాయని,ఈ సంవత్సరం ఆ పరిస్థితి రాకుండా చూసుకోవాలని అన్నారు. విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తినట్లయితే టోల్ ఫ్రీ నెంబర్ 1912 కి తెలియజేయాలన్నారు. మిషన్ భగీరథ, పట్టణాలలో అమృత్ క్రింద చేపట్టిన త్రాగు నీటి స్కీం, ఇతర త్రాగు నీటి స్కీంలకు, ఆసుపత్రులకు, వ్యవసాయ ఫీడర్లకు నిరంతరాయ సరఫరా ఉండే విధంగా ప్రత్యేకంగా పరిరక్షించాలని అన్నారు. జిల్లా కలెక్టర్లు తమ పరిధిలోని సబ్ స్టేషన్లను ఆకస్మిక తనిఖీ చేస్తూ, అక్కడ పరిస్థితులను పరిశీలిస్తూ ఉండాలని సి ఎస్ అన్నారు. రైతు భరోసా పై సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, వ్యవసాయ యోగ్యమైన భూమికి రైతు భరోసా పథకం అమలుకు ప్రభుత్వం నిర్ణయించిందని, ఇప్పటి వరకు 3 ఎకరాల వరకు రైతులకు ఎకరానికి 12 వేల రూపాయలు చొప్పున పెట్టుబడే సహాయం అందిందని, 63% పట్టాదారులు సహాయం పొందారని అన్నారు. ప్రజా పాలన గ్రామ సభలలో కొన్ని సర్వే నెంబర్ లలో కొంత మేర సాగు భూమి వ్యవసాయేతర భూమి గా నమోదైందని తమ దృష్టికి తీసుకుని వచ్చారని, నేడు వాటిని సరి చేసే అవకాశం రైతు భరోసా పోర్టల్ లో అందించామని అన్నారు. రైతు భరోసా పోర్టర్ లో మిగిలిన వ్యవసాయ భూముల నమోదు ప్రక్రియను జిల్లా కలెక్టర్లు 5 రోజులలో పూర్తి చేయాలని అన్నారు. రైతు భరోసా పై ఫిర్యాదులను పరిష్కరించేందుకు ఆ మండల వ్యవసాయ అధికారి వ్యవసాయ విస్తరణ అధికారి పరిధిలో గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని, రైతుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సిఎస్ పేర్కొన్నారు. యాసంగి పంటకు అవసరమైన ఎరువులు సంపూర్ణంగా అందుబాటులో ఉన్నాయని, జిల్లాలలో ప్రతి మండలంలో అవసరమైన ఎరువుల స్టాక్ ఉండే విధంగా కలెక్టర్ పర్యవేక్షించాలని అన్నారు. జిల్లాలలో ఎక్కడైనా అవసరం ఉంటే వెంటనే సంప్రదించాలని, ఎక్కడైనా ప్యాక్ (పి.ఎ.సి.ఎస్) దగ్గర స్టాక్ లేకపోతే వెంటనే స్టాక్ అందించేలా చూడాలని అన్నారు.యాసంగి సాగు నీటి సరఫరా పై సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ,. ఆన్, ఆఫ్ విధానంలో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని, నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం సాగు నీరు రైతులకు అందాలని, ప్రతి నీటి చుక్కను వినియోగించుకోవాలని అన్నారు. ఎస్సారెస్పీ సాగు నీరు అందే కరీంనగర్, పెద్దపల్లి, వరంగల్ సూర్యాపేట, మహబూబాద్ జిల్లాలలో కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించి రాబోయే మూడు వారాలపాటు అప్రమత్తంగా ఉంటూ పంటలు కాపాడేందుకు కృషి చేయాలని అన్నారు.ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఒలంపియాడ్‌లో సత్తా చాటిన 'డఫోడిల్స్' విద్యార్థులు

**పాఠశాల స్థాయి నుంచే ఒలంపియాడ్ విద్య పై దృష్టి పెట్టాలి**

**డఫోడిల్స్ (సి.బి.ఎస్.ఈ ) పాఠశాల కరస్పాండెంట్ చింతల నరేందర్**

**విద్యార్థులుకు ప్రత్యేక అభినందన కార్యక్రమం**

**పాఠశాల యాజమాన్యనికి,విద్యార్థులను ప్రముఖులా అభినందనలు!**



**తొలి సమయం నర్సంపేట ఫిబ్రవరి 19**
ప్రస్తుత పోటీ ప్రపంచంలో జాతీయ స్థాయిలో ఇంజినీరింగ్, మెడికల్ సీటు సాధించడం కష్టతరంగా మారింది. పాఠశాల స్థాయి నుంచే ఉత్తమ ఒలంపియాడ్ విద్య పై దృష్టి పెడితే నేటి కాలంలో సీటు సాధించడం సులభమవుతుందని డఫోడిల్స్ (సి.బి.ఎస్.ఈ) పాఠశాల కరస్పాండెంట్ చింతల నరెందర్ అన్నారు.నర్సంపేట పట్టణానికి చెందిన డఫోడిల్స్ సి.బి.యస్.సి పాఠశాల విద్యార్థులు శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించినఒలంపియాడ్ పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో సత్తా చాటిన సందర్భంగా విద్యార్థులుకు ప్రత్యేక అభినందన కార్యక్రమం నిర్వహించి ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతల నరెందర్ మాట్లాడుతూ..విద్యార్థులు రాబోయే పరీక్షల్లో కూడా కష్టపడి చదివి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాలలో చెప్పిన పాఠాలే కుకుండా, తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటి వద్ద కూడా నిరంతరం చదువుపై దృష్టి సారించేలా చూడాలని ముఖ్యంగా ఇలాంటి పోటీ పరీక్షలు విద్యార్థుల్లోని దాగి ఉన్న సృజానాత్మకతను వెలికి తీసేందుకు ఎంతగానో ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. తమ పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థిని తమ ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షిస్తూనే ఉంటారని, వారి అభ్యున్నతికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారని తెలిపారు. విద్యార్థులకు సిలబస్‌లో ఉన్న పాఠాలే కాకుండా, ప్రత్యేక పాఠ్యాంశాలను కూడా జోడించి బోధిస్తున్నామని అన్నారు.అనంతరం పాఠశాల యాజమాన్యనికి విద్యార్థులను ప్రముఖులా అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమం లో పాఠశాల సెక్రటరీ సాయి కీర్తన రోహిత్, ప్రధానోపాద్యాయులు అజీముద్దీన్, ఉప ప్రధానోపాధ్యాయులు సి. హెచ్ రీటా,శశికల,హెచ్. ఆర్. డి విజయలక్ష్మి, అనూష ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# గెలుపు ఓటములకి అతీతమైన స్ఫూర్తి
# కేవలం క్రీడల్లోనే కాదు రాజకీయాల్లోనూ ఉండాలి : కేటీఆర్




**తొలి సమయం వరంగల్ ప్రతినిధి ఫిబ్రవరి 18:**
తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకువచ్చిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదిన వేడుకలలో భాగంగా ముఖ్య అతిథిగా భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారక రామారావు పాల్గొని మాట్లాడుతూభారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకులు, మాజీ చీఫ్ విప్, దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.. కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రతీఏటా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో కెసిఆర్ క్రికెట్ ఛాంపియన్‌షిప్‌తో పాటు వాలీబాల్, కోకో క్రీడల పోటీలను కూడా నిర్వహిస్తున్నారు.క్రీడాకారుల కోసం పోటీలు నిర్వహిస్తున్న వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌కు అభినందనలు పదవిలో ఉన్నా లేకున్నా ప్రజల కోసం దాస్యం వినయ్ భాస్కర్ పనిచేస్తున్నారు. అధికారంలేకున్నా ప్రజల కోసం బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు నిరంతరం ప్రజాక్షేత్రంలో ఉంటున్నారు. రాష్ట్ర ప్రజల ఆశీర్వాదం, ముఖ్యంగా యువకుల పట్టుదలతో కేసీఆర్ మరోసారి అధికారంలోకి రావడం ఖాయం రానున్న రోజుల్లో తెలంగాణలో బీఆర్ఎస్‌దే విజయం కేసీఆర్ మన ముఖ్యమంత్రి అని అన్నారు. కేసీఆర్ క్రికెట్ ఛాంపియన్‌షిప్‌తో పాటు ఇతర పోటీల్లో విజయం సాధించిన విజేతలకు అభినందనలు కాగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన కేసీఆర్ క్రికెట్ కప్ 2025 విన్నర్‌గా 54వ డివిజన్ నిలువగా, రన్నరప్‌గా 49వ డివిజన్ నిలిచింది. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ కాకతీయ క్రికెట్ అకాడమీ ఫౌండర్ ఫారుక్ మరియు సభ్యులు మాజిద్,అస్లాం, షాకీర్,వీరు,సిరాజ్,రాజేష్ కుమార్,మాజిద్ డెక్కరాంబాబు,ఫర్దిన్ , వరంగల్ పశ్చిమ నాయకులు పులి రజనీకాంత్,జోరిక రమేష్ రామ్మూర్తి,బుద్ధ వెంకన్న, పెద్దిరాజు,ప్రణయ్, యాదగిరి, రఘు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సై వేధింపులు తట్టుకోలేకపోతున్నాం

**ఆత్మహత్యకు అనుమతించండి సార్ అంటూ ప్లెక్సీతో**

**కలెక్టరేట్ ఎదుట వృద్ధ దంపతుల ఆందోళన**




**తొలి సమయం భూపాలపల్లి ఫిబ్రవరి 18:**
భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం వేములపల్లికి చెందిన సంది సులోచన, ప్రతాప్ రెడ్డి దంపతులకు 12 ఎకరాల భూమి ఉంది ఈ భూమికి వెళ్లడానికి ఉన్న దారిని రెండున్నరేళ్లుగా ములుగు జిల్లా కన్నాయిగూడెం ఎస్సైగా పనిచేస్తున్న ఇనిగాల వెంకటేష్, అతడి సోదరుడు, తండ్రి కలిసి మూసివేశారని ఆరోపించిన దంపతులు దీనిపై హైదరాబాద్ వెళ్లి ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే ఆ ఎస్సై మాపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆందోళన మూడేళ్లుగా పొలానికి వెళ్లలేక వ్యవసాయం చేయట్లేదని.. తమకు ఆత్మహత్యే దిక్కని, ఆత్మహత్యకు అనుమతించాలని ప్లెక్సీతో భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేసిన వృద్ధ దంపతులు.


# రైతులను మోసం చేసిన బహుళ జాతి మొక్కజొన్న కంపెనీలు

**రైతులకు నష్టపరిహారాన్ని చెల్లించాలి : బిజెపి నాయకుల వినతి పత్రం**



**వెంకటాపురం (తొలి సమయం) ఫిబ్రవరి 18**
వెంకటాపురం మండలంలో బిజెపి పార్టీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు తోట సతీష్ ఆధ్వర్యంలో బహుళ జాతి మొక్కజొన్న విత్తనాలైనా హైటెక్ ,సింజంట కంపెనీలు అధిక దిగుబడి వస్తుంది అని ఆశ చూపించి రైతులను మభ్యపెట్టి రైతులను మోసం చేశారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి 1,50,000 నష్ట పరిహారాన్ని నేరుగా రైతుల ఖాతాలో జమ చేయాలని రైతులకు తగు న్యాయం చేయాలని భారతీయ జనతా పార్టీ తరపున వెంకటాపురం మండల తాసిల్దార్ , అగ్రికల్చర్ ఆఫీసర్ వినతి పత్రం అందజేశారు అదేవిధంగా బహుళ జాతి మొక్కజొన్న విత్తన కంపెనీల పై తగు చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను కోరారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామెల్ల రాజశేఖర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ బొల్లె సునీల్ ,మండల కార్యదర్శి సాధన పల్లి విజయ్ మండల యువమోర్చా అధ్యక్షుడు నోముల శ్రీ కిషన్, కలవచర్ల నవీన్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు

# రాణి రుద్రమ దేవి, రాణా ప్రతాప్ రెడ్డిలను పరామర్శించిన ఎంపీ ఈటల రాజేందర్



**తొలి సమయం నర్సంపేట ఫిబ్రవరి 18:**
తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి గోగుల రాణి రుద్రమదేవి, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాపరెడ్డి తన మాతృమూర్తి జయశ్రీ కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకొని మంగళవారం నర్సంపేట వారి స్వగృహానికి వెళ్లి గోగుల జయశ్రీ చిత్రపటానికి పూలమాలవేసి అనంతరం నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు బిజెపి నేత ఈటెల రాజేందర్ తో పాటు బిజెపి రాష్ట్ర నాయకులు, మాజీ ఎంపీ సీతారాం నాయక్, వరంగల్ జిల్లా అధ్యక్షులు గంటల కుమార్, ఎర్రబెల్లి ప్రదీప్ రావు, కొండేటి శ్రీధర్, కాళీ ప్రసాద్, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# కేంద్ర ఎన్నికల ప్రధానాధికారిగా జ్ఞానేశ్ కుమార్

**అర్ధరాత్రి దాటిన తరవాత రాష్ట్రపతి ఉత్తర్వులు**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి18:**భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ సిఇసిగా జ్ఞానేష్ కుమార్ నియమితులయ్యారు.ఈ మేరకు సోమవారం రాత్రి పొద్దుపోయిన తరువాత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆయనతోపాటు ఎన్నికల కమిషనర్‌గా వివేక్‌జోషిని నియమించారు. అంతకుముందు నూతన ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకానికి సంబంధించి ప్రధాని మోడీ అధ్యక్షతన సమావేశం జరిగింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా నూతన కమిటీ నియామకం చేస్తున్నదని, సుప్రీంకోర్టులో తీర్పు వచ్చే వరకు ఓపిక పట్టాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. అయినప్పటికీ నూతన సిఇసిగా జ్ఞానేష్ కుమార్ నియామకానికే కేంద్రం మొగ్గుచూపింది.

# బంగ్లా తాత్కాలిక ప్రభుత్వాధినేత యూనస్ ఓ ఉగ్రవాది

**- దేశానికి తిరిగి వస్తా..ప్రతీకారం తీర్చుకుంటా - కార్యకర్తలకు మాజీ ప్రధాని హసీనా ఓదార్పు**

ఢాకా,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ): బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ ఓ ఉగ్రవాది అంటూ ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా ఘాటు విమర్శలు చేశారు. అవామీ లీగ్ పార్టీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన ఓ బహిరంగ కార్యక్రమంలో.. హసీనా జూమ్‌కాల్ ద్వారా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె కార్యకర్తలను ఉద్దేశిస్తూ మాట్లాడారు. తాను బంగ్లాకు తిరిగి వస్తానని, పార్టీ కార్యకర్తల మరణాలకు ప్రతీకారం తీర్చుకుంటానని ప్రతిజ్ఞ చేశారు. 'అవామీ లీగ్ పార్టీ నాయకులు ఓపికగా.. ఐక్యంగా ఉండాలి. నేను నా దేశానికి తిరిగి వస్తా. పార్టీ కార్యకర్తల మృతికి ప్రతీకారం తీర్చుకుంటా. గతంలో మాదిరిగానే అందరికీ న్యాయం చేస్తా. జులై- ఆగస్టుల్లో జరిగిన నిరసనల్లో మరణించినవారు పోలీసుల కాల్పుల కారణంగా చనిపోలేదు. ఇప్పుడు పోస్టుమార్టం నిర్వహిస్తే నిజాలు రుజువు అవుతాయి. విద్యార్థులు చేసిన ఆందోళనలకు అనేకమంది పోలీసులు, అవామీ లీగ్ కార్యకర్తలు, విద్యావంతులు, కళాకారులు హత్యకు గురయ్యారు. అయినా యూనస్ వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదు. దేశాన్ని నడపడంలో తనకు ఎలాంటి అనుభవం లేదని గతంలోనే ఆయన అంగీకరించారు. అన్ని విచారణ కమిటీలను రద్దు చేసి దేశాన్ని నాశనం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలపై, అధికారులపై దాడులు చేయడం యూనస్ అసమర్థతకు నిదర్శనం. ప్రణాళికతోనే నా తండ్రి నివాసాన్ని నాశనం చేశారు. మధ్యంతర ప్రభుత్వం ఏర్పడి ఇన్ని నెలలు గడుస్తున్నా.. అల్లర్లు ఆగలేదు. దేశ ఆర్థికవ్యవస్థ సంక్షోభంలో ఉంది. శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయి, ప్రజల భద్రత ప్రమాదంలో ఉంది. ఈ ఉగ్రవాద ప్రభుత్వాన్ని తరిమికొట్టాలి' అని ఆమె పేర్కొన్నారు.

# ఆక్వాలో టెక్నాలజీ జోడిస్తే మంచి ఫలితాలు

**అమరావతి,ఫిబ్రవరి18:** టెక్నాలజీ వాడకంతో అక్వా రంగంలో అద్భుత ఫలితాలు సాధించవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిపుష్టికి ఆక్వారంగం గ్రోత్ ఇంజన్‌గా నిలుస్తుందన్నారు. టెక్నాలజీ వాడకం, నూతన పద్ధతులతో ఈ రంగంలో నిలకడగా 30 గ్రోత్‌రేట్ సాధ్యమేనన్నారు. ఆక్వాలో ప్రకృతి సేద్యంతో ప్రపంచ వ్యాప్తంగా మన ఉత్పత్తులకు డిమాండ్ ఏర్పడుతుందని సీఎం వివరించారు. ప్రకృతి సేద్యం ద్వారా వ్యవసాయంలో మంచి ఫలితాలు వస్తున్నాయని.. ఆక్వాలో కూడా ఆ తరహా విధానాలు అమలు చేయాలన్నారు. ఆక్వా ఫీడ్ విషయంలో తగు మార్పులు చేయాలని అన్నారు. మన ఉత్పత్తులకు వ్యాల్యూ యాడ్ చెయ్యడం ద్వారా రైతులు ఎక్కువ ఆదాయం పొందవచ్చని సీఎం చెప్పారు. ప్రస్తుతం 4 లక్షల ఎకరాల్లో ఆక్వాను సాగు చేస్తున్నారని.. 2029-30నాటికి 10 లక్షల ఎకరాలకు పెరగాలని సీఎం ఆకాంక్షించారు.

అయితే కాలుష్య రహితంగా ఆక్వా ప్రయాణం సాగాలన్నారు. ఆక్వాలో ప్రధాన సమస్యగా ఉన్న కాలుష్యానికి పరిష్కార మార్గాలు ఉన్నాయని.. వాటిని రైతులు, ఉత్పత్తి దారులు పాటించాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ సాగు వివరాలను రిజిస్టర్ చేసుకోవాలని.. అలా కాకుండా ఇష్టానుసారంగా చేస్తానంటే మాత్రం నిబంధనల ప్రకారం వ్యవహరిస్తామని చెప్పారు. ఆక్వాకు ప్రాధాన్యం అనేది తమ అభిమతమన్న సీఎం.. నిబంధనల అమలకు కూడా అంతే ప్రాధాన్యం ఇస్తామని...పొల్యూషన్ విషయంలో కఠినంగా ఉంటామని స్పష్టం చేశారు. మూడు రోజుల పాటు విజయవాడలోని హోటల్‌లో జరిగిన ఆక్వా టెక్ 2.0 కాన్ క్లేవ్ చివరి రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. జిఎఫ్ఎస్‌టి ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ఆక్వారంగంలో వస్తున్న మార్పులు, అవకాశాలు, సమస్యలు, పరిష్కారాలు, పాలసీలు, టెక్నాలజీ సహకారం వంటి అంశాలపై చర్చించారు. రైతులు, ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల యజమానులు, ట్రేడర్లుతో పాటు నిపుణులు ఈ కాన్‌క్లేవ్‌లో పాల్గొన్నారు. రాష్ట్రానికి ఆక్వాను ప్రధాన ఆదాయ వనరుగా మార్చేందుకు ఉన్న అవకాశాలు, అధిగమించాల్సిన అవరోధాలపై ఈ సదస్సుల్లో చర్చించారు. రైతులను చైతన్య పరిచేలా.. టెక్నాలజీ వాడకం పెంచేలా మూడు రోజుల పాటు పలు అంశాలపై ఇక్కడ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. 'ఆక్వా రంగంపై నాకు ప్రత్యేక మైన శ్రద్ధ ఉంది.. మన రాష్ట్రం ఆక్వా సాగుకు అత్యంత అనుకూలం. 2014-19 మధ్య కాలంలో నాడు ఆక్వా రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరుగా నిలిచింది. రాష్ట్ర జీవీఎ(స్థూల విలువ జోడింపు)లో 8.8 శాతం ఆక్వా వాటాగా ఉంది. వియత్నాం వంటి దేశాల్లో మన కంటే తక్కువ ప్రొడక్షన్ ఉన్నా.. వాల్యుయేషన్?లో వాళ్లు ముందు ఉన్నారు. వియత్నాం ఆక్వా ఉత్పత్తుల్లో 3.9 మిలియన్ టన్నుల ఎగుమతులతో 13 బిలియన్ డాటర్లు ఆర్జిస్తుండగా, మనం 5 మిలియన్ మెట్రిక్ టన్నులు ఎగుమతి చేస్తూ 3 బిలియన్ డాలర్లు మాత్రమే ఆర్జిస్తున్నాం. మనం కూడా ఆ దిశగా ప్రయాణం చేయడానికి ఇలాంటి సదస్సులు ఉపయోగపడతాయి. మన ఉత్పత్తులను ప్రాసెస్ చేయడం ద్వారా మంచి ధరలు పొందవచ్చు. దీనికి పరిష్కారం వేస్ట్ టు వెల్త్. దీని ద్వారా సమస్యలు పరిష్కారం చూపవచ్చు' అని సీఎం అన్నారు '1995లో నాడు ఐటీ అన్నాను.. నేడు ఏఐ అంటున్నాను. మనం టెక్నాలజీని స్వాగతించాలి. ఖర్చులు తగ్గించుకునేందుకు, నాణ్యత పెంచేందుకు ఏఐను ఆక్వారంగంలోనూ విరివిగా వాడాలి. రొయ్యల రైతులు రకరకాల వైరస్‌ల కారణంగా నష్టపోతుంటారు. వీటి సమాచారాన్ని ఏఐ ద్వారా విశ్లేషించి ఏ జబ్బులు వచ్చే అవకాశం ఉందనేది కూడా తెలుసుకోవచ్చు. తద్వారా సరైన మందులతో ముందుగానే తగు చర్యలు తీసుకోవచ్చు. ఏఐ అనేది నేను చెపుతుంటే కొందరు అర్థం చేసుకోవడం లేదు. కానీ తప్పదు ఏఐ టూల్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలి. టెక్నాలజీ, అవకాశాలను అందిపుచ్చుకుంటేనే సత్వర ఫలితాలు వస్తాయి. డాటా ఆధారంగా రాబోయే రోగాన్ని ముందే కనిపెట్టి చెప్పవచ్చు. మరోవైపు పంటల ఉత్పత్తితో పాటు.. ప్రాసెసింగ్ ఉంటేనే అగ్రో బేస్డ్ ఇండస్ట్రీకి భవిష్యత్ ఉంటుంది.

## ప్రచారంలో సోషల్ మీడియాదే హల్‌చల్ !

సామాజిక మాధ్యామల ప్రచారం,ప్రాధాన్యం పెరిగిన తరవాత ఇప్పుడు ప్రతి పనికి దానిని బాగా వాడుతున్నారు. ప్రధానంగా ఎన్నికల సమయంలో దీని ప్రాధాన్యం ఇక చెప్పక్కరలేదు. గ్రామస్థాయిలోనే సమాచారం నేరుగా ప్రజలకు క్షణాల్లో చేరిపోతోంది. ఈ క్రమంలో ఈ మధ్య ఆక్సిజన్, ఓటు అంటూ తెగ ప్రచారం సాగుతోంది. ప్రాణికి ఆక్సిజన్ ఎంత అవసరమో..ప్రజాస్వామ్యం బతకాలంటే 0 2 అంతే అవసరమంటూ ఫార్వర్డులు విపరీతంగా వస్తున్నాయి. ప్రతి ప్రాణి జీవించాలన్నా.... ఊపిరితో మనుగడ సాగించాలన్నా ప్రాణవాయువు ముఖ్యం. అది లేకుంటే జీవుల మనుగడే లేదు. ఏ జీవి కూడా బతికే అవకాశం లేదు. జీవుల మనుగడకు మూలమైన ప్రాణవాయువు ఆక్సిజన్. దీన్ని రసాయన శాస్త్రంలో ఆంగ్ల అక్షరంలో 02 (ఓటు) అని అంటారు. అంటే ఓటూ అనేది జీవుల మనుగడకు అవసరమైన ఆక్సిజన్ మూలకం. అదే విధంగా ప్రజాస్వామ్యం మనుగడకు కూడా 'ఓటు' ఎంతో ప్రధానం. అర్హత గల ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించిననాడే ప్రజాస్వామ్యం బలపడుతుంది. మనగలుగుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రారంభమైన నాటి నుంచి ప్రభుత్వాలు ఓటర్లలో చైతన్యం తెచ్చేందుకు ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా ఓటర్లంతా పూర్తిగా తమ హక్కు వినియోగించుకోవడం లేదు. ఓటుహక్కు ఉన్న వారంతా ఓటేయకపోతే ప్రజాస్వామ్యం నిర్వీర్యం అవుతుంది. అందుకే జీవులు బతకాలన్నా...ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలన్నా ఓటు అవసరమే..అన్న సందేశంతో సోషల్ మీడియాలో ప్రచారం తెగ హల్‌చల్ చేస్తోంది. ఇలా సోషల్ మీడియాకు ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తించినందునే..రాజకీయ నేతలంతా తమ ప్రచారానికి ఇప్పుడు సోషల్ మీడియాను అతిగా వాడుకుంటున్నారు. ఒకప్పుడు ఎన్నికల ప్రచారం అంటే బహిరంగ సభలు, ర్యాలీలు, ఇంటింటి ప్రచారం. ఆ తర్వాత ప్రచార రథాలు, ఫ్లెక్సీలు, కరపత్రాలు, పోస్టర్లు ద్వారా ప్రజలను ఆకట్టుకునేవారు. అభ్యర్థులు వీధి వీధి తిరిగి ప్రజలను కలిసి తాము చేసిన అభివృద్ధిని వివరించేవారు. ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో ట్రెండ్ మారింది. వాయు వేగంతో సమాచారాన్ని ప్రజలకు చేరవేసేలా సోషల్ మీడియాను ప్రచార సాధనంగా మలుచుకుంటున్నారు. డిజిటల్ యుగంలో సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకుని అన్ని పార్టీలు తమ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. రాష్ట్రంలో చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అధికారపార్టీ ప్రయత్నిస్తుంటే, పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రతిపక్షాలు ఎండగడుతున్నాయి. ప్రస్తుత శాసనసభ ఎన్నికల ప్రచారం ఊపందుకుంటోంది. అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ త్వరలో ముగియనుండటంతో అభ్యర్థుల విజయం కోసం ఆయా పార్టీల కార్యకర్తలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం మార్మోగిస్తున్నారు. అభ్యర్థులు సైతం ప్రచార సమయం సరిపోక సామాజిక మాధ్యమాలపై ఆధారపడుతున్నారు. ఇందుకు ప్రత్యేకంగా సాంకేతిక నిపుణలను నియమిం చుకున్నారు. ఆయా పార్టీల కార్యాలయాల్లో కూర్చొని కొత్త తరహా ప్రచారం చేస్తున్నారు.


ఇలవేల్పులు జరుపుకుందాం ! ఆదివాసి సంస్కృతిని రక్షించుదాం !! ఆదివాసి మనుగడను కాపాడుదాం !!!



చుంచ వారి ఇలవేల్పుల

బాలకుమారుని జాతర ఆహ్వానము

తేది : 22, 23, మరియు 24 ఫిబ్రవరి 2025 వరకు

స్థలం : గ్రా॥ మడగూడెం, క్రిష్ణానగర్, మం॥ గంగారం, జిల్లా : మహబూబాబాద్



జాతర కార్యక్రమాలు

తేది : 22-02-2025 శనివారం రోజు మ॥ 2-00 గం॥లకు వనం తెచ్చుట మరియు సా॥ 5-00 గం॥లకు పొన్న తెచ్చుట.

తేది : 23-02-2025 ఆదివారం రోజు దేవుని గద్దెల మీద నిలుపటం, మొక్కులు చెల్లించుట,

మ॥ 3-00 గం॥లకు గంగ స్నానంకు పోవుట, రాత్రి 2-00 గం॥లకు గుడి మెలుగుట,

తేది : 24-02-2025 సోమవారం రోజు సాయంత్రం దేవత వన ప్రవేశం తె॥జా॥న 4-00 గం॥లకు హోరానికి పోవుట

సీమ కుమారుడు : చుంచ రాజశేఖర్, పెద్ద వడ్డెలు : పెండకట్ల వంశీయులు, పడిగ వడ్డెలు : యాప వంశీయులు, తలపతులు (నిగామనులు) : చుంచ వంశీయులు, ఆర్థిబిడ్డ : రావుల వంశీయులు

క్రీడాకారులు : 20-02-2025 రోజు కంటె ముందే తమ టీమ్ పేరును నమోదు చేసుకోవలెను.

క్రీడలు ఫ్రెండ్స్ యూత్ మరియు అల్లూరి సీతరామరాజు యూత్ అసోసియేషన్‌లు గేమ్స్ నిర్వహిస్తున్నాయి.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

9441411085, 9491012880, 8985315176, 9490114847, 8500738365, 9490106551, 9494283135

జాతర నిర్వాహణ కమిటీ : చుంచ వంశీయులు


TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101